ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 23 జూన్ 2024





ప్రవేశాలకు.. ప్రతిబంధకాలు

- దైన్యస్థితిలో ఎన్నో డిగ్రీ కళాశాలలు
- గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో ఇక్కట్లు
- మేజర్, మైనర్ విధానంతో మరింత గందరగోళం



గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

గుంటూరు(విద్య), జూన్ 22 : డిగ్రీ కళాశాలలు పలు కోర్సులతో వేల సంఖ్యలో విద్యార్థులతో కళకళలాడేవి. ఇంజనీరింగ్ తదితర ఎన్నో కోర్సులు వచ్చినా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు డిమాండ్ తగ్గేది కాదు. సామాజిక చైతన్య కేంద్రాలుగా డిగ్రీ కళాశాలలు విలసిల్లేవి. విద్యావేత్తలు, ప్రభుత్వాలు కూడా డిగ్రీ కళాశాలలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు డిగ్రీ కళాశాలల పాలిట శాపాల్లా మారాయి. ఒకప్పుడు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఫలానా కాలేజీలో డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందడం అంటే ఓ ఘనతగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కారణంగా విద్యార్థుల ప్రవేశాలు సరిగా లేక ఆయా కళాశాలలు దైన్యస్థితికి చేరాయి. వందేళ్ల చరిత్ర ఉన్న పలు డిగ్రీ కళాశాలల్లో గతంలో బీఎస్సీ, బీకాం, బీఏ, బీబీఏ, బీసీఏ వంటి డిగ్రీ కోర్సులకు ఎంతో డిమాండ్ ఉండేది. ఫలితంగా విద్యార్థులతో కళకళలాడిన డిగ్రీ కళా శాలలు నేడు విద్యార్థుల లేక వెలవెలపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు, జాతీయ విద్యా విధానం పేరుతో తీసుకువచ్చిన అనేక సంస్కరణలు డిగ్రీ కళాశాలలకు గుదిబండగా మారడంతో ఈ దుస్థితి నెలకొందని అధ్యాపకులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 20 వరకు ఎయిడెడ్ డిగ్రీ కళా శాలలు ఉండగా అరకొర అడ్మిషన్లతో నెట్టుకు వస్తున్నాయి. డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వడంలో కూడా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. దీంతో ఎక్కడా చేరలేక పోయిన వారు, సప్లమెంటరీ విద్యార్థులు మాత్రమే డిగ్రీ కళాశాలల్లో చేరుతున్నారు. మెరిట్ విద్యార్థులు ఇతర వర్సిటీలకు తరలిపోతున్నారు. గతంలో ఒక్కో కళాశాలలో సగటున వెయ్యి నుంచి 2 వేల మంది విద్యార్థులు ఉండేవారు. గతంలో ఇం టర్ ఫలితాలు రాగానే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమయ్యేవి. అయితే రెండేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇది గందరగోళంగా మారడంతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఆ నోటిఫికేషన్ కూడా ఎప్పుడు వస్తుందో తెలియక గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నూతన విద్యా విధానంతో గందరగోళం

డిగ్రీలో నూతన విద్యావిధానం ప్రకారం మేజర్ మైనర్ కోర్సులంటూ ప్రవేశ పెట్టారు. ఉదాహరణకు బీఎస్సీ(గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ) తీసుకుంటే ఇందులో గణితం మేజర్ సబ్జెక్టుగా ఫిజిక్స్, కెమిస్ట్రీ మైనర్ సబ్జెక్టులుగా ప్రాధాన్యం లేని విధంగా ఉంటున్నాయి. మూడేళ్లలో గణితానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ మైనర్ సబ్జెక్టుల గురించి పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఫలితంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు భారీగా గండి కొట్టినట్లు అవుతుందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాతపద్ధతిలో మూడు సబ్జెక్టులకు సమ ప్రాధాన్యం, సమానమైన మార్కులు ఉండేవి కొత్త విధానంలో అటువంటి పరిస్థితి లేదు.

మరోవైపు ఇంటర్ సప్లిమెంటరీలో పాస్ అయిన వారికి అనేక కళాశాలల్లో సీట్లు రావడం లేదు. డిగ్రీ కోర్సులకు ప్రభుత్వం సగటున రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తోండగా అది ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. అనేక మంది విద్యార్థులకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో చివరి రెండు, మూడు సంవత్సరాల్లో విద్యార్థులు భారీ సంఖ్య లో డ్రాపవుట్స్ అవుతున్నారు. ఒకప్పుడు విద్యార్థినులతో కళకళాడిన గుంటూరులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సైతం అడ్మిషన్లకు ఇక్కట్లు వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు గడుస్తున్నా ఇంకా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ రాలేదు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనా లేక ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు చేస్తారో తెలియక విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

జీవో 77తో పీజీ కోర్సులకు చెక్

డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఎక్కువ మంది పీజీ కోర్సుల వైపు దృష్టిసారిస్తారు. అయితే గత ప్రభుత్వం జీవో 77 తీసుకువచ్చి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. గతంలో పీజీ విద్యార్థులకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు రీయింబర్స్‌మెంట్ చెల్లించేవారు. జగన్ ప్రభుత్వం పీజీ కోర్సులకు రీయింబర్స్‌మెంట్ కట్ చేసింది. ఫలితంగా డిగ్రీ చదివిన అనేక మంది పీజీ కోర్సుల్లో చేరడం లేదు. కొద్దిగా డబ్బున్న కుటుంబాల విద్యార్థులకు మాత్రమే ప్రస్తుతం పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

త్వరలో లోకేశ్‌తో ఆక్టా భేటీ

ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఆక్టా(అఫ్లియేటెడ్ కాలేజెస్ టీచర్స్ అసోసియేషన్) నాయకులు త్వరలో విద్యామంత్రి లోకేశ్‌తో భేటీ కావాలని నిర్ణయించారు. డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు, జీవో 77, మేజర్, మైనర్ కోర్సులు గురించి యువగళం పాదయాత్రలో లోకేశ్‌కు సంఘ నాయకులు వివరించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం గతంలో తమకు హామీ ఇచ్చిన లోకేశ్ విద్యాశాఖ మంత్రి కావడంతో ఆయన ఆయా అంశాలపై సానుకూలంగా స్పందిస్తారని, సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉందని ఆక్టా నాయకులు, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజెస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

కలెక్టర్లు బదిలీ

- గుంటూరుకు నాగలక్ష్మి
- బాపట్ల బాధ్యతలు జేసీ శ్రీధర్‌కు
- కర్నూలు జిల్లా కలెక్టర్‌గా రంజిత్‌బాషా
- జీఏడీలో రిపోర్టు చేయాలని వేణుగోపాల్‌రెడ్డికి ఆదేశం

గుంటూరు, బాపట్ల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు యంత్రాంగం ప్రక్షాళన మొదలుపెట్టారు. శనివారం పలు జిల్లాల కలెక్టర్లను మార్చారు. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు, బాపట్ల కలెక్టర్లను బదిలీ చేశారు. గుంటూరు జిల్లా నూతన కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మి నియమితులు కాగా బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌కు అప్పగించారు. బాపట్ల జిల్లాకు నూతన కలెక్టర్ నియామకమయ్యే వరకు ఈయనే కలెక్టర్‌గా విధులు నిర్వహించనున్నారు

గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాలరెడ్డికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన్ను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న రంజిత్‌బాషాను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన నాగలక్ష్మి గతంలో గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన బదిలీల్లో విజయనగరం కలెక్టర్‌గా ఉన్న నాగలక్ష్మిని గుంటూరు కలెక్టర్‌గా మార్చారు. ఇంచుమించు రెండేళ్లకుపైగా గుంటూరు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ దక్కలేదు. ఆయన్ను ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగంలో పోస్టింగ్ కోసం రిపోర్టు చేయాల్సిందిగా చీఫ్ సెక్రెటరి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీపై ఉద్యోగ వర్గాల్లో పలు విధాలుగా చర్చ జరుగుతున్నది. వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన సీనియర్ ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా జీఏడీలోనే రిపోర్టు చేయాలని గతవారం ప్రభుత్వం ఆదేశించింది. వారికి ఇంతవరకు ఎలాంటి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో వేణుగోపాల్‌రెడ్డికి పోస్టింగ్ ఇవ్వకపోవడానికి కారణాలు ఉన్నాయన్న చర్చ కూడా జరుగుతున్నది. అమరావతి రాజధానిలో ఆర్ 5 జోన్‌ని వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు పెద్దల ఆదేశాల మేరకు కలెక్టర్ హోదాలో దీనికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చి లే అవుట్లను ఏర్పాటు చేయించారు. అలానే సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాల మేరకు రాజధాని భూసేకరణ నోటిఫికేషన్లను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పోస్టింగ్ ఇవ్వకపోవడానికి ఇవి కారణమై ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

గుంటూరుపై నాగలక్ష్మికి అవగాహన..

తమిళనాడు రాష్ట్రానికి చెందిన నాగలక్ష్మి సెల్వరాజన్ గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సమయంలో మంచి పేరు తెచ్చుకున్నారు. విధి నిర్వహణల్లో ముక్కుసూటిగా వ్యవహరించేవారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గేవారు కాదు. ఎక్కడా అధికార దర్పం ప్రదర్శించే వారు కాదు. కృష్ణానది పుష్కరాల సమయంలో కమిషనర్‌గా విధులు నిర్వహించారు. ఆ సమయంలో గుంటూరు నగరంలోకి అప్రోచ్ రోడ్లు అయిన జీఎన్‌టీ, ఏటుకూరు, పొన్నూరు, మంగళగిరి, నందివెలుగు రహదారుల అభివృద్ధికి కృషి చేశారు. రోడ్లను వెడల్పు చేయించి సెంట్రల్ డివైడర్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు చాలావరకు పరిష్కరించారు. గుంటగ్రౌండ్ రోడ్డు, డొంకరోడ్డు విస్తరణ పనులు కూడా ఆమె హయాంలోనే జరిగాయి. కీలకమైన ఏఈఎల్‌సీ స్థలాన్ని రోడ్డు విస్తరణ కోసం సేకరించగలిగారు. నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టబోయే కలెక్టర్‌కు జిల్లాపై అవగాహన ఉన్న దృష్ట్యా పరిపాలన సులభతరం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

గుంటూరుతో అనుబంధం ఎక్కువ

సివిల్ సర్వెంట్‌గా గుంటూరుతో తనకు అనుబంధం ఎక్కువని జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన ఎస్ నాగలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి ఆమె ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నగరపాలకసంస్థ కమి షనర్‌గా విధులు నిర్వహించిన జిల్లాకే కలెక్టర్‌గా నియామకం పొందడం సంతోషకరంగా ఉందన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ప్రజలు చూపిన ఆదరాభిమానాలు, ఉద్యోగులు, అధికారుల సహకారం మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను ఆచరణలో పెట్టడమే తన ముందున్న ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రతీ సోమవారం క్రమం తప్పకుండా గ్రీవెన్స్ రిడ్రెసల్ కార్యక్రమానికి హాజరై ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

టీడీపీ పార్లమెంటరీ పార్టీ లీడర్‌గా.. లావు



- ఉమ్మడి గుంటూరు జిల్లాకు పదవుల పంట
- ఇప్పటికే కేంద్రమంత్రిగా పెమ్మసాని
- రాష్ట్ర కేబినెట్‌లో ముగ్గురికి చోటు
- ధూళిపాళ్ళకు ఖరారైన చీఫ్‌విప్ పోస్టు

గుంటూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లా పదవుల పంపకంలో అగ్రస్థానంలో నిలిచింది. కూటమిలో భాగంగా కేంద్ర కేబినెట్‌లో అనూహ్యంగా గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి తొలిసారి గెలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయ మంత్రిగా చోటు దక్కిన విషయం తెలిసిందే. ఇదే జిల్లా పరిధిలోని నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి రెండో పర్యాయం గెలుపొందిన విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ ప్రెసిడెంట్ లావు శ్రీకృష్ణదేవరాయలుకు కీలక పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయన్ను ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. త్వరలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో నూతన ఎంపీల ప్రమాణ స్వీకారం అయిన తరువాత లావును పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకోనున్నారు. తాజా ఎన్నికలో గెలవడం ద్వారా లావు రెండో పర్యాయం లోక్‌సభలో అడుగు పెడుతున్నారు. గత ఎన్నికల్లో ఆయన వైసీపీ తరుపున గెలుపొందినప్పటికీ తన పందాకు, విలువలకు భంగం కలగకుండా వ్యవహరించారు. వైసీపీ ప్రభుత్వం నుంచి తనకు ఎటువంటి సహకారం లభించనప్పటికీ నేరుగా కేంద్రమంత్రులతో పరిచయాలు పెట్టుకుని వారి సహకారంతో పల్నాడు ప్రాంతంలో అభివృద్ధి కోసం కృషి చేశారు. అయితే వైసీపీ భావజాలాలు ముఖ్యంగా ప్రత్యర్థుల పైనే కాకుండా వారి కుటుంబీకులను సైతం బూతులు తిట్టే సంప్రదాయం అదే పార్టీలో ఉన్న లావు జీర్ణించుకోలేకపోయారు. దీంతో ఆయన్ను పార్టీలో నుంచి పంపేందుకు పొమ్మనకుండా జగన్ పొగపెట్టాడు. సిట్టింగ్ ఎంపీగా ఉండి నియోజకవర్గ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న శ్రీకృష్ణదేవరాయలును అకారణంగా వలస పంపే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన వైసీపీలో కొనసాగను అని జగన్‌కు చెప్పి పార్టీకి రాజీనామా చేశారు. తదనంతరం టీడీపీ తరఫున నరసరావుపేట నుంచి పోటీ చేసే అవకాశం చంద్రబాబు కల్పించారు. రెండోసారి గెలుపొంది సీనియర్‌గా ఉండటమే కాకుండా పార్లమెంటులో గత ఐదేళ్ళలో వివిధ అంశాలపై పలు మార్లు కూలంకషంగా చర్చించిన అనుభవాన్ని కూడా పరిగణలోకి తీసుకుని పార్లమెంటరీ పార్టీ నేతగా ఆయన్ను నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే రాష్ట్ర కేబినెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన ముగ్గురుకి చోటు దక్కటమే కాకుండా కీలకశాఖలు కూడా లభించాయి. అంతే కాకుండా పొన్నూరు నుంచి ఆరోసారి విజయం సాధించిన టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు కూడా చీఫ్‌విప్ పదవిని కట్టబెట్టేందుకు అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. రెండు, మూడు రోజుల్లో ఆయన నియామకాన్ని కూడా ప్రకటిస్తారు. కాగా అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ కీలక పదవులు లభించటంతో రాజధాని ప్రాంత వాసులు, ముఖ్యంగా అమరావతి కోసం భూములను త్యాగం చేసిన రైతులు సంబర పడిపోతున్నారు.

విద్యుత్ మంత్రిగా గొట్టిపాటి

- బాధ్యతలు స్వీకరించిన రవికుమార్
- వ్యవసాయ కనెక్షన్ల మంజూరుపై తొలి సంతకం
- దేశంలోనే ఆదర్శవంతమైన శాఖగా తీర్చిదిద్దుతామన్న మంత్రి

అద్దంకి, జూన్ 22: అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం మధ్యాహ్నం వెలగపూడి సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అద్దంకి నుంచి ఐదో సారి వరుస విజయాలతో రికార్డు సృష్టించిన గొట్టిపాటి రవికుమార్‌ను ఇటీవల చంద్రబాబు తన క్యాబినెట్‌లోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో గొట్టిపాటి ఆ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖకు సంబంధించి మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో కొత్తగా 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరుపై మంత్రిగా గొట్టిపాటి తొలి సంతకం చేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల్లో దశల వారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికీ 3 కిలోవాట్ల సోలార్ విద్యుత్ అందించే ఫైల్స్‌పై కూడా సంతకాలు చేశారు. విద్యుత్ డిమాండ్, సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి తెలిపారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు ఆద్యుడు చంద్రబాబునాయుడు అన్నారు. దేశంలో ఉత్తమ విద్యుత్ శాఖగా రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దుతామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా పని చేయాలని సూచించారు. గత ప్రభుత్వం విద్యుత్‌శాఖను నిర్వీర్యం చేయడమే కాకుండా 9 సార్లు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారంమోపిందన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న గొట్టిపాటి రవికుమార్

పలువురు అభినందన

విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గొట్టిపాటి రవికుమార్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, ప్రవీణ్, జీవీ ఆంజనేయులు, చింతమనేని ప్రభాకర్, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆదిరెడ్డి శ్రీనివాస్, కూన రవికుమార్ తదితరులు కలిసి అభినందించారు.

నకిలీలపై.. నిర్లక్ష్యం

విత్తనంపై.. పంట ఎదుగుదల, దిగుబడితో పాటు రైతన్న జీవితం ఆధారపడి ఉంటుంది. మంచి విత్తనం అయితే అధిక దిగుబడితో రైతు లబ్ధి పొందతాడు. అదే నకిలీదైతే పంట పండక రైతు ఆర్థికంగా చితికిపోయి అప్పుల పాలవుతాడు. కొందరైతే తనువు కూడా చాలిస్తాడు. ఇంతటి ప్రాధాన్యమైన విత్తనం విషయంలో కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతుండగా వారికి కొందరు అధికారులు సహకరిస్తున్నారు. దీంతో మార్కెట్‌ను నకిలీ విత్తనాలు ముంచెత్తుతున్నాయి.



- విత్తన వ్యాపారులపై 6 ఏ కేసుతో సరి
- రైతులు నట్టేట మునిగినా కంటితుడుపు చర్యలే
- చిన్న కేసులేనని రెచ్చిపోతున్న అక్రమ వ్యాపారులు

గుంటూరు సిటీ, జూన్ 22: రైతుల జీవితాలతో ఆడుకునే నకిలీ విత్తనాల వ్యాపారులను కట్టడి చేసే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నకిలీ విత్తన వ్యాపారులపై కఠినమైన చర్యలు చేపట్టడంలేదు. వ్యాపారులు నకిలీ విత్తనాలతో రైతులను నట్టేట ముంచినా వారిపై కేవలం 6 ఏ కేసులతో సరి పెడుతున్నారు. ఎన్ని నకిలీ విత్తనాలు విక్రయించినా, ఎన్ని సార్లు పట్టుబడినా.. పెట్టేది ఆ చిన్న కేసు మాత్రమే కావడంతో కొందరు అక్రమ వ్యాపారులు రెచ్చిపోతున్నారన్న వాదన వినిపిస్తోంది.

ఎక్కడైనా అదే.. ఎవరైనా అదే

గత నెలలో గుంటూరు ఏటుకూరురోడ్డులోని సింధూరి సీడ్స్‌లో నకిలీ మిరప విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలో ప్యాక్ చేసి అమ్మాల్సిన విత్తనాలను ఇక్కడ ప్యాక్ చేస్తుండగా స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేశారు. రాజాగారి తోటలో కూడా శారదా పరమేశ్వరి సీడ్స్ నుంచి కాలం చెల్లిన 14.25 కేజీల విత్తనాలు వ్యవసాయ శాఖ అధికారులు పట్టుకున్నారు. అక్కడా అదే కేసు నమోదు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరికొన్ని చోట్ల ఇదే రీతిలో విజిలెన్స్ అధికారులు నకిలీ విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే వారి పై పస లేని 6ఏ కేసు మాత్రమే పెట్టారు. అంటే రైతు నిండా మునిగే విత్తనం విషయంలో అధికారులు ఎంతటి నిర్లక్ష్యంగా ఉన్నారో తెలుసుకోవచ్చు.

పోయేది ఏమీ లేదు...

ది ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ 1955లోని సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేయటం వల్ల పెద్దగా జరిగే నష్టం ఏమీ ఉండదు. ఈ చట్ట ప్రకారం విత్తనాలను సీజ్ చేస్తారు. విచారణ తర్వాత మహా అయితే రూ.500 జరిమానా, 5 నెలలు జైలు శిక్ష మాత్రమే పడుతుంది. కొన్ని సందర్భాల్లో సీజ్ చేసిన వాటిని జప్తు చేస్తారు. ఇటువంటి బలహీనమైన కేసు వల్ల నకిలీ విత్తనాలు వ్యాపారులు నేరం మళ్లీ మళ్లీ చేసేందుకు వెనుకాడటం లేదు. విజిలెన్స్ రికార్డుల ప్రకారం చూస్తే నకిలీ విత్తనాలు పదే పదే పాత వారి వద్దే దొరుకుతున్నట్లు అర్థమవుతుంది. ఒక ఏడాది భాగస్వాములు మారినా మళ్లీ అక్కడే నకిలీ విత్తనాలు పట్టుపడుతూ ఉండటం గమనార్హం. 6ఏ కేసు వల్లే కొందరు వ్యాపారులు ఏ విధమైన అనుమతి లేకుండా పక్క రాష్ట్రాల నుంచి తీసుకుని వచ్చి నిర్భయంగా అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

మిగిలిన శాఖల సహకారం కరువే..

నకిలీ విత్తనాల కేసుల విషయంలో పోలీసు శాఖ సహకారం కరువైనట్లు కనిపిస్తుంది. విత్తనాలు పట్టుకున్న తర్వాత కేసు నమోదు చేయడానికి వ్యవసాయ శాఖ పోలీసు స్టేషన్‌లో తప్పస్సు చేయాల్సి వస్తుంది. కేసు నమోదు నుంచి కోర్టుకు వెళ్లే వరకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వ్యవసాయ అధికారులు ఆవేదన చెందుతున్నారు. ఆ తర్వాత కూడా కేసు నిరూపణ కొరకు ఇబ్బందులు ఎదురైనా నకిలీ విత్తనాల వ్యాపారులకు శిక్ష పడేలా చేస్తున్నామని అంటున్నారు. మిగిలిన శాఖల సమన్వయం, సహకారం ఉంటే నకిలీ విత్తనాలు వ్యాపారుల ఆట కట్టించటం పెద్ద సమస్య కాదనేది కొందరి అభిప్రాయం.

అప్పట్లో వణుకు...

కాంతిలాల్ దండే ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ గా ఉన్నప్పుడు నకిలీ విత్తనాల వ్యాపారులపై ఉక్కుపాదం మోపారు. అప్పట్లో పదే పదే నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుపడిన వారిపై, కొన్ని కంపెనీలపై పీడీ యాక్టు పెట్టించారు. అటువంటి కఠిన చర్యలు ఉండటం వల్ల చాలామంది అప్పట్లో నకిలీల వైపు చూసేందుకు భయపడ్డారు. ఈ కేసులో బెయిల్ కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు తెచ్చి అమ్మే సాహసం వ్యాపారులు చెయ్యలేదు.

ఏఎన్‌యూలో దూరవిద్య కోర్సులు



గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) దూరవిద్య విభాగం- వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఈ కోర్సులను ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో నిర్వహిస్తారు.

డిగ్రీ: బీఏ, బీకాం, బీబీఏ ప్రోగ్రామ్‌ల వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

బీఏ సబ్జెక్టులు: ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్.

బీకాం సబ్జెక్టులు: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్

- బీబీఏ, బీఎల్ఐఎస్సీ, బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. బీఏ(ఎకనామిక్స్, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం(జనరల్) కోర్సులను తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో చదువుకోవచ్చు. మిగిలిన బీఏ కోర్సులు తెలుగు మాధ్యమంలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ/ఇంటర్ ఒకేషనల్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎల్ఐఎస్సీ కోర్సుకు మాత్రం ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

పీజీ: ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సుల వ్యవధి రెండేళ్లు. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

- ఎంఏ కోర్సుల్లో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లను ఆ మాధ్యమంలోనే చదవాలి. ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) కోర్సులు తెలుగు మాధ్యమంలో ఉన్నాయి. మిగిలిన కోర్సులను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి.

అర్హత: ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ కోర్సులకు ఏదేని డిగ్రీ; ఎంఏ(ఎకనామిక్స్)కు బీఏ(ఎకనామిక్స్); ఎంకాం కోర్సుకు బీకాం/బీబీఏ; ఎంఎల్ఐఎస్సీ కోర్సుకు బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏలో లాంగ్వేజ్ స్పెషలైజేషన్‌లకు ఆ లాంగ్వేజ్‌లు ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.

డిప్లొమా: ఈ కోర్సుల్లో ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫుడ్ ప్రొడక్షన్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, సైకలాజికల్ గైడెన్స్ కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/పాలిటెక్నిక్ డిప్లొమా/రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్టిఫికెట్ కోర్సులు: హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్, హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్ కోర్సులు ఉన్నాయి. కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. హౌస్ కీపింగ్ కోర్సుకు పదోతరగతి ఉత్తీర్ణులు, ఎయిడ్స్ కౌన్సెలింగ్‌కు ఇంటర్(పారామెడికల్)తోపాటు ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.anucde.info

దిక్సూచి DIKSUCHI

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MQRZNeDలో చదవండి.

విశాఖ ఐఐపీఈలో బీటెక్

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ)- బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్‌తోపాటు డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తిచేసి క్యాట్ స్కోర్ లేకుండానే ఐఐఎం విశాఖపట్నంలో ఎంబీఏ చదివే వీలుంది.

విభాగాలు-సీట్లు: పెట్రోలియం ఇంజనీరింగ్‌లో 62 సీట్లు, కెమికల్ ఇంజనీరింగ్‌లో 63 సీట్లు, మెకానికల్ ఇంజనీరింగ్‌లో 40 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 65 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** iipe.ac.in

ఓయూలో లేటరల్ ఎంట్రీ

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్'- బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో లేటరల్ ఎంట్రీకి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. 'కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీప్)' కింద నిర్వహిస్తున్న ఈ ప్రోగ్రామ్‌లను డిప్లొమా పూర్తిచేసిన వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేకించారు. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసిన అభ్యర్థులకు బీఈ/బీటెక్ రెండో ఏడాది ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. సాయంత్రం సమయాల్లో ఆరు నుంచి తొమ్మిదిన్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు రూ.50,000.

అర్హత: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా గుర్తింపు పొందిన బోర్డు నుంచి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐ&ఎంఎల్ స్పెషలైజేషన్‌కు ఏ విభాగంవారైనా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఈ/ఏఐ/ఏఐడీ/ఏఐఎం /సీఎంఈ/సీఎస్‌బీ/సీఎస్‌సీ/సీఎస్‌డీ/సీఎస్‌జీ/సీఎస్ఐ/సీఎస్ఎం/సీఎస్ఎన్/సీఎస్ఓ/సీఎస్‌టీ/సీఎస్‌డబ్ల్యూ/సీఐసీ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థులందరికీ కనీసం ఏడాది ఫుల్ టైమ్ ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 11
- **ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 18
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 21
- **మొదటి ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 27
- **రెండో ఫేజ్ కౌన్సెలింగ్:** ఆగస్టు 3
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

విజువల్‌గా.. మ్యూజికల్‌గా...



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా రూపుదిద్దుకుంటున్న 'తండేల్' చిత్రం వైజాగ్, శ్రీకాకుళం షెడ్యూల్ శనివారంతో పూర్తయింది. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. ఈ షెడ్యూల్‌లో హీరోహీరోయిన్లతో పాటు ఇతర నటీనటులు పాల్గొనగా కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. పాత్రల గెటప్, కాస్ట్యూమ్స్, బాడీ లాంగ్వేజ్, యాస ప్రామాణికంగా ఉండేలా దర్శకుడు చందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాస్తవ సంఘటనల ప్రేరణతో ఓ ప్రేమ కథగా 'తండేల్'ను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. విజువల్‌గా, మ్యూజికల్‌గా ఎంతో అద్భుతంగా ఉండేలా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, ఎడిటింగ్: నవీన్ నూలి.

రామానుజుల గొప్పతనం చెప్పే కథ



డా. సాయి వెంకట్ టైటిల్ రోల్‌లో నటించి.. దర్శకత్వం వహించిన సినిమా 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా వస్తున్న ఈ సినిమా ఫస్ట్ పార్ట్ జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'జయహో రామానుజ' సినిమా పాటలను చిత్ర బృందం శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సాయి వెంకట్ మాట్లాడుతూ 'మహిళల్ని గౌరవించాలని.. కుల మతాలకు అతీతంగా ఐకమత్యంతో మానవాళి కలిసి ఉండాలని సందేశాన్ని ఇచ్చిన గొప్ప గురువు భగవత్ శ్రీ రామానుజాచార్యులు. ఆయన గొప్పదనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందించాను' అని చెప్పారు. నిర్మాత ప్రవల్లిక మాట్లాడుతూ 'భారీ స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో నిర్మించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, దర్శకుడు వీరశంకర్ పాల్గొన్నారు.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ



హాస్య నటుడు అలీ ఫ్యామిలీ నుంచి వచ్చిన సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పి.ఎల్. విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ల లింగయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గోదావరి అందాలు, నేచురల్ లొకేషన్స్‌లో చిత్రీకరించిన ఈ చిత్రంలోని 'కలలో - కలలో' అంటూ సాగే గీతాన్ని సంగీత దర్శకుడు కోటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ పాట చూస్తుంటే చక్కని అనుభూతి కలుగుతోంది. సాహిత్యం, సంగీతం, హీరోహీరోయిన్ల అభినయం చక్కగా కుదిరాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే పాట అవుతుంది' అన్నారు. 'ఇది ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానం అందంగా చూపించే ప్రయత్నం చేశాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేస్తాం' అని తెలిపారు దర్శకనిర్మాతలు. సునీల్ రావినూతల, పృథ్వీ, సాయికుమార్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.

ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో...



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఈ సినిమాలోని ఓ పాటకు 'వార్', 'పఠాన్' సినిమాల ఫేమ్.. ప్రముఖ కొరియోగ్రాఫర్ బోస్కో మార్టిస్ నృత్యరీతుల్ని సమకూరుస్తున్నారు. థాయిలాండ్‌లో ప్రస్తుతం ఆ పాట షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌తో తీసుకున్న ఫొటోను ఆయన షేర్ చేస్తూ.. "అత్యద్భుతమైన ప్రతిభావంతుడు ఎన్టీఆర్‌తో పనిచేయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు.

కల్కి ప్రత్యేక షో, టికెట్ ధరల పెంపునకు అనుమతి



ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం ప్రత్యేక ప్రదర్శన, టికెట్ ధరల పెంపునకు అనుమతినిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈనెల 27వ తేదీన చిత్రం విడుదల కానుంది. జూలై 4వ తేదీ దాకా 8 రోజుల పాటు ప్రతీరోజూ ఐదు షోలు ప్రదర్శించటానికి అవకాశం ఇచ్చారు. విడుదల రోజు ఉదయం 5:30 గంటలకు ప్రత్యేక ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ రోజు మొత్తం ఆరు షోలు ప్రదర్శించనున్నారు. ఇక టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ.200లకు పెంచుకోవడానికి అనుమతించారు. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న టికెట్ ధరపై రూ.75, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా పెంచుకోవడానికి అనుమతిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్ శనివారం మెమోనెం.23424/జనరల్.ఏ1/2024ను జారీ చేశారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

లక్కు..నీ వెంట ...



'నా పేరు శివ', 'అంధగారం' వంటి చిత్రాల్లో నటించిన వినోద్ కిషన్ ప్రస్తుతం 'పేక మేడలు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. అనూష కృష్ణ హీరోయిన్. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం భార్గవ్ కార్తీక్ రాసిన 'లక్కు నీ వెంట కుక్క తోక లెక్క ఊపుకుంటూ వచ్చరో లచ్చన్న' అంటూ సాగే పాటను విడుదల చేశారు. నాగూర్ బాబు ఈ పాట పాడారు. స్మరణ్ సాయి సంగీత దర్శకుడు. ఈ సినిమాను జులైలో విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.

ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు.. గడువు నిర్దేశించుకొని పూర్తి చేస్తాం

● ప్రభుత్వ శాఖల సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని
● నేడు గుంటూరు యూజీడీపై సమీక్ష



కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిర్వహించిన సమీక్షకు హాజరైన కలెక్టర్, జేసీ, రైల్వే డీఆర్ఎం

గుంటూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఐదేళ్ల నుంచి రైల్వే ప్రాజెక్టుల్లో ఏ ఒక్కటి ముందుకు పోలేదు. వాటన్నింటిని పట్టాలెక్కించి గడువు తేదీని నిర్దేశించుకొని పూర్తిచేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక రోడ్లు, భవనాల అతిథిగృహంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ ఇతర అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంపై ప్రధానంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులు సాధ్యమైనంత త్వరలో పూర్తిచేసేలా కృషి చేస్తామని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు, పెదపలకలూరు, మంగళగిరి, నగరంలోని శంకర్‌విలాస్ సెంటరు, సీతానగర్, నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ రైల్వేగేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్, శ్యామలనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణాల అనుమతుల వివరాలు, నందివెలుగు రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనుల వివరాలను అధికారులు కేంద్రమంత్రికి వివరించారు. పనుల వారీగా అనుమతుల మంజూరుకు రైల్వేశాఖ, ఆర్‌అండ్‌బీ, స్థానిక సంస్థలు చేపట్టాల్సిన చర్యలపై కేంద్రమంత్రి సమీక్షించి అధికారులకు సూచనలు జారీ చేశారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును తెనాలిలో నిలిపి ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు రైల్వే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని డివిజనల్ రైల్వే అధికారులను ఆదేశించారు. గుంటూరు నుంచి బెంగళూరుకు పగటిపూట రైల్వే సౌలభ్యం కల్పించే అంశంపై సమీక్షించారు. మంగళగిరి నుంచి తెనాలికి రెండు లైన్ల రోడ్డుకు ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

నగరంలోని శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి ఆధునికీకరణకు ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలపై కూడా సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో పదిహేను వరకు రైల్వేబ్రిడ్జ్‌లు రూ.1000కోట్ల నుంచి రూ.2000కోట్ల పనులకు సంబంధించి డీపీఆర్ రూపొందించినవి, డీపీఆర్ రూపొందించాల్సిన ఆర్వోబీ, ఆర్‌యూబీ ప్రాజెక్టులు, ప్రస్తుతం అవి రైల్వేశాఖలో ఎక్కడ పెండింగ్‌లో ఉన్నాయో తదితర వివరాలను, వాటిని పూర్తిచేయటానికి కాలపరిమితి నిర్దేశించటం జరిగిందన్నారు. బ్రిడ్జ్‌లు, రహదారుల నిర్మాణం వలన ఓట్లు రావనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా వీటి గురించి పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం ప్రకారం రానున్న పార్లమెంట్ సమావేశంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తామన్నారు.

కాగా ఆదివారం గుంటూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల స్థితిగతులపై మునిసిపల్, ప్రజారోగ్య తదితర శాఖల అధికారులతో కేంద్రమంత్రి ఐబీలో సమీక్షించాలని నిర్ణయించారు. అలానే సాయంత్రం జీజీహెచ్‌ని సందర్శించి అక్కడ సమస్యలు తెలుసుకొని చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష చేస్తారు.

తొలుత కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీనివాసమూర్తి, సీపీవో శేషశ్రీ, గుంటూరు నగరపాలక సంస్థ ఎస్‌ఈ శ్యాం ప్రసాద్, సిటీ ప్లానర్ ప్రదీప్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఐబీలో కోలాహలం

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వివిధ ప్రభుత్వ శాఖలతో సమీక్షలు ఏర్పాటు చేయడంతో కలెక్టర్, జేసీ, రైల్వే డీఆర్ఎం వంటి ఉన్నతాధికారులతో పాటు ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు. అలానే కూటమి నేతలు కూడా వచ్చారు. తెలుగుదేశం పార్టీ నుంచి చిట్టాబత్తిన శ్రీనివాసరావు, నాయుడు ఓంకార్, అడకా శ్రీనివాసరావు, మన్నవ వంశీ, బీజేపీ నాయకులు, జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, ఎంఆర్‌పీఎస్, మాల మహానాడు నాయకులు, విశ్రాంత డీఆర్‌వో కొసనా నాగబాబు తదితరులు హాజరయ్యారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● జిల్లాలో ప్రగతి పనులపై ఎంపీ లావు సమీక్ష



సమావేశంలో ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ

నరసరావుపేట, జూన్22: జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న ఐదు జాతీయ రహదారులు నిర్మాణం పూర్తికి అవసరమైన నిధుల కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలో కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రగతిపనుల పురోగతిపై ఎంపీ లావు సమీక్షించారు. ఐదు జాతీయ రహదరులకు సంబంధించి భూసేకరణ, నిధుల లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో సదరు ప్రగతి పనులపై చర్చిస్తానని చెప్పారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లత్కర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యాలయం వరకు రహదారినిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో ఎత్తిపోతల పథకాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి వివరాలు సేకరించారు. అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జలజీవన్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని, అవసరమైన నిధులు కొరకు ప్రతిపాదనలు త్వరితగతిన రెడీ చేయాలన్నారు. గుంటూరు-బీబీనగర్ రైల్వేపనులపై సమీక్షించారు. వీవర్స్ షెడ్స్ ఏర్పాటుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. కార్యక్రమంలో జేసీ ఏ శ్యాంప్రసాద్, డీఆర్వో వినాయకంరెడ్డి, ఆర్డీవో పి.సరోజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సభా, సంప్రదాయాలను జగన్ మంట కలిపారు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూన్ 22: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభా సంప్రదాయాలను మంట కలిపారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అన్ని పార్టీలు కలిసి లాంచనంగా అయ్యన్నపాత్రుడుని స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టడం సంప్రదాయం అన్నారు. సభా విలువలను మంటగలిపి పులివెందుల పర్యటన సాకుతో సభకి డుమ్మాకొట్టి తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. అతనితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు పదిమందిని నిలువరించడం జగన్‌రెడ్డి తనలోని శాడిస్ట్ చర్యను బయటపెట్టుకున్నారన్నారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌రెడ్డిని అగౌరవపరచిన ప్రభుత్వమని బ్యానర్ ఐటమ్‌గా తన నీలిమీడియాలో రాశారన్నారు. ఒక సాధారణ ఎమ్మెల్యేని మాజీ ముఖ్యమంత్రి అనే గౌరవంతో అతని వాహనాన్ని సమావేశ మందిరం వరకు అనుమతించడం, మంత్రుల తరువాత ప్రమాణ స్వీకారం చేయించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తప్పా? అన్నారు. అగౌరవ పరచాలి అనుకుంటే జగన్‌రెడ్డి ఎప్పుడు ప్రమాణం చేయాలో మీ రోతపత్రిక రాస్తే బాగుంటుందని హితవు పలికారు. కనీసం తనతో పాటు గెలిచిన పదిమంది ఎమ్మెల్యేల ప్రమాణం కూడా చూడకుండా వెళ్లిపోవడం సభా సంప్రదాయాలను మంట కలపడం కాదా అనేది ఆలోచించుకోవాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

సమన్వయంతో పని చేయండి

● ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్

కొల్లిపర, జూన్ 22: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచేవిధంగా కృషి చేయాలని ఏపీ ఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో చేసిన అభివృద్ధి పనులు ఏ స్థాయిలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నేరవేర్చే దిశగా ఉన్నారన్నారు. జూలై 1వతేది నుంచి పెన్షన్ పెంపుదల చేసి అర్హులందరికి అందిస్తామన్నారు.తొలుత నాదెండ్ల మనోహర్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. వికలాంగుల సంక్షేమం కోసం భీమవరపు వేణుగోపాల రెడ్డి రూ.25వేల చెక్కును మంత్రి మనోహర్‌కు అందజేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయం.. వ్యాపారికి న్యాయం..



వ్యాపారి స్థలాన్ని స్వాధీనం చేసుకుని చేసిన నిర్మాణం

తెనాలి అర్బన్, జూన్ 22: రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించడంతో వ్యాపారికి న్యాయం చేకూరింది. రాష్ట్ర వ్యాప్తంగా అధికార జులుం ప్రదర్శించిన వైసీపీ నేతలు తెనాలిలో కూడా అక్కడక్కడ తమ ప్రతాపం చూపారు. బోసు రోడ్డు నుంచి మూర్తి కొండయ్య వీధికి వెళ్లే మార్గంలో చిన్న భవనంలో నూనె రామకృష్ణ అనే వ్యక్తి దుస్తుల దుకాణం నడుపుకుని జీవిస్తున్నాడు. దుకాణం వెనుక వైసీపీ నేతగా ఉన్న ఓ టైలర్ ఏడాది క్రితం రాత్రికి రాత్రే దుకాణాన్ని జేసీబీతో తొలగించి ఆక్రమించేశాడు. తన ఇంటిలోకి వెళ్లడానికి ఈ స్థలాన్ని అనువుగా మార్చుకున్నాడు. ఆర్యవైశ్య సంఘాలు, టీడీపీ నాయకులు, ఈ దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించినప్పటికీ న్యాయం చేయాలని వ్యాపారి మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు వ్యాపారికి అండగా నిలబడ్డారు. దీంతో రామకృష్ణ తన స్థలం స్వాధీనం చేసుకుని గోడ కట్టి తలుపు ఏర్పాటుచేసుకున్నాడు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కూడా కౌన్సిలర్ దేసు యుగంధర్ ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే అతనిపై కూడా వైసీపీ కౌన్సిలర్లు దాడికి తెగబడ్డారు. ఈ అంశంలో అటు కౌన్సిల్ చైర్మన్‌గాని పోలీసులుగాని పట్టించుకోలేదు. ఈ అంశాన్ని కూడా తెరపైకి తెచ్చి నిందితులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ, సీడాక్‌ల మధ్య ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్ వీసీ ఆచార్య నాగభూషన్ తదితరులు

గుంటూరు(విద్య), జూన్ 22: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, బెంగుళూరులోని సీడాక్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్) ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని శనివారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డాక్టర్ ఎస్‌డీ సుదర్శన్‌తో వర్సిటీ వీసీ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన విద్యార్థులకు, అధ్యాపకులకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ట్రైనింగ్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో ప్రత్యేక శిక్షణ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌డీ సుదర్శన్ మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీడాక్ శాస్త్రవేత్త హరిబాబు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతవరం నుంచి గ్రావెల్ మాయం

తుళ్లూరు, జూన్ 22: అనంతవరం కొండ నుంచి రాత్రికి రాత్రిళ్ల గ్రావెల్ మాయం అవుతోంది. ఒక్కోసారి పట్టపగలు కూడా తోలుకు పోతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. కొండ వెనక నుంచి గ్రావెల్ గుట్టు చప్పుడు కాకుండా తరలిపోతుంది. కర్లపాలెం మీదుగా గ్రావెల్ లారీలు వెళుతున్నట్టు తెలుస్తుంది. ఎటువంటి అనుమతులు లేకపోయినా గ్రావెల్ పోతుండటం గమనార్హం. ప్రైవేటు వెంచర్లకు ఈ గ్రావెల్ వెళుతున్నట్లు సమాచారం.

లెవల్ క్రాసింగ్ గేటు మూసివేత

తాడేపల్లి, జూన్ 22: తాడేపల్లి మండలం ఇప్పటం మంగళగిరి మధ్య రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్‌ను రైల్వే బెడ్ ఏర్పాటు నిమిత్తం తాత్కాలికంగా ఈ నెల 24 నుంచి 27వరకు మూసివేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. పెదవడ్లపూడి, కృష్ణాకెనాల్ జంక్షన్ మధ్య మూడవ రైల్వే బెడ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు జంక్షన్ల మధ్య వున్న ఈ లెవల్ క్రాస్ గేట్ తాత్కాలికంగా నిలిపివేస్తునట్టు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంగళగిరి ఇప్పటం లెవల్ క్రాసింగ్ గేట్ (305) మూసివేయబడుతుందని ఈ ప్రాంతం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గం చూసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన కోటగిరి రాజా

యడ్లపాడు, జూన్ 22: పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు నక్కవాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన కోటగిరి రాజ(25) శనివారం గుంటూరుకు వచ్చి అనంతరం తిరిగి సాయంత్రం గ్రామానికి బయలుదేరాడు. యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే అదే మార్గంలో వెళుతున్న కారు గేదెల్ని తప్పించే క్రమంలో ప్రక్కకు రావడంతో బైక్‌ను ఢీకొట్టింది. దీనితో రాజ క్రింద పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన యువకుడిని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజ అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు కనకదుర్గ సన్నిధికి రాజధాని రైతులు

తుళ్లూరు, జూన్22: రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు ఆదివారం కాలినడకన విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారి సన్నిధికి మొక్కులు తీర్చుకోవటానికి వెళ్లనున్నారు. తెల్లవారుజామున 4గంటలకు పొంగళ్లు పెట్టి తుళ్లూరు రైతు దీక్ష శిబిరం నుంచి బయలుదేరతారు. కూటమి విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటంతో అమరావతి ఊపిరి పీల్చుకుంది. పూర్వ వైభవం రావటంతో అమ్మవారికి ఆగిన మొక్కును చెల్లించుకుంటున్నామని మహిళలు పేర్కొన్నారు. 2020 జనవరి 10న తుళ్లూరు నుంచి విజయవాడ కనకదర్గమ్మ సన్నిధికి బయలుదేరిన మహిళలను పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



దయేరియా వ్యాధి నిర్మూలనపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

దయేరియా వ్యాప్తిని అరికట్టాలి

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, జూన్ 22 : జిల్లాలో దయేరియా వ్యాధి వ్యాప్తిని పూర్తి స్థాయిలో అరికట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. దయేరియా వ్యాధి నిర్మూలనపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యలతోనే దయేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టగలమని చెప్పారు. కలుషితనీరు తాగకుండా ప్రజలకు అవగాహన కల్పించటమే ముఖ్యమన్నారు. ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని అధికారులు తప్పనిసరిగా పరీక్షించాలని ఆయన ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలలో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్లు తాగునీటి నమూనాలను పరీక్షలకు పంపాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయరాదని ఆదేశించారు. జూలై 1వ తేది నుంచి ఆగస్టు చివరి వరకు దయేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టాలన్నారు. ఇంటింటా ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. గ్రామసచివాలయాల వారిగా కార్యక్రమాల నిర్వహణపై అధికారులు సూక్ష్మప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. చిన్నారులలో దయేరియా మరణాలు పూర్తిగా అరికట్టటానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. మలేరియా, డెంగీ విషజ్వరాలు ప్రభలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గృహాల మధ్య వర్షం నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. మురికినీటి కుంటలు, కాల్వలను శుభ్రపర్చాలన్నారు. పాఠశాలలో క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఐదేళ్ళలోపు చిన్నారులలో దయేరియా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా జింకు మాత్రలు పంపిణీ చేయాలన్నారు. చేతులు పరిశుభ్ర పర్చుకోవటంపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులలో అవగాహన కల్పించాలని తెలిపారు. పరిశుభ్రమైన శుద్ధజలాలను ప్రజలకు సరఫరా చేయటానికి ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజు ఇంజనీర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జడ్పీ డిప్యూటీ సీఈవో మోహనరావు, డీపీవో రవికుమార్, డీఈవో కె.నారాయణ పాల్గొన్నారు.

శ్రీబగళాముఖిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు ప్రొటోకాల్ రిజిస్ట్రార్



రాఘవస్వామి దంపతులను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, జూన్ 22 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి శనివారం ఏపీ హైకోర్టు ప్రొటోకాల్ రిజిస్ట్రార్ ఎ.రాఘవస్వామి దంపతులు సతీసమేతంగా ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో రాఘవస్వామి దంపతులకు వేద ఆశీర్వచనంతో అమ్మవారి చిత్రపటం అందజేసి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయ విశేషాలు గురించి అర్చకుల ద్వారా రాఘవస్వామి దంపతులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శతవార్షిక ప్రతిష్ఠోత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ

బాపట్ల, జూన్ 22 : పట్టణంలోని ఎస్‌ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీ గంగాపర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం లక్షమల్లికా పుష్పార్చన, సహస్ర గులాబీపూజ అత్యంత వైభవంగా జరిగింది. పర్వతవర్ధిని కోలాట సంఘం వారితో ఏర్పాటు చేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఉదయం విశేష వసంతోత్సవం, త్రిశూల స్నానం అనంతరం దేవాలయ శతవార్షిక ప్రతిష్ఠోత్సవాల కరపత్రాలను ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ ఆవిష్కరించారు. రెండు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్‌స్వామి, చిట్టిబాబు, నెమలికంటి హనుమంతరావు, గంటా హరిశంకరరావు, ధూళిపాళ్ళ ఉమామహేశ్వరరావు, గంటా సాయిబాబు, జిడుగు సోమయ్య, ఆలయ అర్చకులు కొల్లిపర ప్రసాదస్వామి, గూడూరు చిట్టిబాబు, సాయివెంకట్, పంగులూరి కౌండిన్య, భీమవరపు సురేష్, బండి వెంకట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శతవార్షిక ప్రతిష్ఠోత్సవ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ధర్మకర్త ఆదూరి హరినారాయణ, నెమలికంటి హనుమంతరావు తదితరులు

ఫార్మశీ కళాశాలలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బాపట్ల, జూన్ 22 : బాపట్ల ఫార్మశీ కళాశాలలో శనివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1995వ సంవత్సరంలో ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత చదువులు నేర్పిన గురువులను కలుసుకొని కళాశాల ఆవరణలో సంతోషంగా గడిపారు. ఇక్కడ చదువుకొని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన వారంతా ఒకే వేదికపైకి రావటంతోపాటు కుటుంబ నేపథ్యం గురించి తెలుసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నాటి మధురస్మృతులను నెమరవేసుకున్నారు. ఇన్నేళ్ళ తర్వాత కళాశాలలో కలవటం సంతోషంగా ఉందని వారు అన్నారు. కార్యక్రమానికి బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, వల్లభ ఫీడ్స్ ఎండీ బొల్లా శ్రీనివాసరావు, డాక్టర్ రెడ్డి లేబరేటరీస్ నుంచి ఎ.సుధాకర్, మైలాన్ ఫార్మా సిటికల్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వై.ప్రశాంత్, అసిస్టెంట్ మేనేజర్ జి.మధుసూదనరావు, ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, జి.దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కె.హరిపద్మప్రసాద్, కోశాధికారి టి.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చదువులు నేర్పిన గురువులను పూర్వవిద్యార్థులు సత్కరించారు.



పూర్వవిద్యార్థులతో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తదితరులు

డివైడర్‌పైకి దూసుకెళ్ళిన లారీ

● తృటిలో తప్పిన ప్రమాదం



డివైడర్లపై దూసుకెళ్ళిన లారీ

బాపట్ల, జూన్ 22 : నిర్లక్ష్యంగా లారీ నడపడంతో డివైడర్ పైకి దూసుకెళ్ళింది. బాపట్ల పట్టణంలోని జీబీసీ రోడ్డులో శనివారం జరిగిన ఈ సంఘటనలో చుట్టుపక్కల జనం లేకపోవటం వల్ల ప్రమాదం తృటిలో తప్పింది. సిమెంట్ లోడ్‌తో వేగంగా వస్తున్న లారీ సినిమాహాలు ఎదురు డివైడర్‌ను గుర్తించకుండా పైగా వెళ్ళింది. ప్రమాదంలో లారీ ముందుభాగం ధ్వంసమైంది. డివైడర్‌లు దెబ్బతిన్నాయి. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదు.

డంపింగ్ యార్డులో ఆరని మంటలు

● చుట్టుపక్కల గృహాలను చుట్టుముడుతున్న పొగలు

● అల్లాడిపోతున్న ప్రజలు.. పట్టించుకోని అధికారులు



డంపింగ్ యార్డులో రేగిన మంటల వల్ల వస్తున్న పొగలు

బాపట్ల, జూన్ 22 : పట్టణంలోని డంపింగ్ యార్డులో పది రోజుల క్రితం వ్యాపించిన మంటలు నేటికి ఆరలేదు. మొదటిరోజు చెలరేగిన మంటలను కొంత వరకు ఆపిన అధికారులు దానిని పూర్తి స్థాయిలో ఆపలేమని చేతులెత్తేశారు. దీనివల్ల అప్పటి నుంచి డంపింగ్ యార్డులోని చెత్తాచెదారం కాలుతూ పొగలు ఎగసిపడుతున్నాయి. చుట్టుపక్కల ఉన్న గృహాలలోకి పొగలు వెళ్ళి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొంతమంది పొగవల్ల ఊపిరిఆడక అల్లాడిపోతున్నారు. అయినప్పటికి అధికారులు తమకేమి పట్టదన్నట్లు చోద్యం చూస్తున్నారు. డంపింగ్‌యార్డు పక్కనే ఈస్ట్‌స్వాంప్, వెస్ట్‌స్వాంప్ డ్రైన్‌లు ఉన్నాయి. అందులో నీరు ఉంది. ఆ నీటిని ఇంజన్‌ల ద్వారా డంపింగ్‌యార్డులో మంటలు ఆపే ప్రయత్నం చేయవచ్చు. ఆ దిశగా అధికారులు స్పందించటం లేదు. పెద్ద ఎత్తున మంటలు రేగినప్పుడు మొక్కుబడిగా ఫైరింజన్ తీసుకొచ్చి ఆర్పే ప్రయత్నం చేస్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపటంలేదు. దీనిపై ఆయా ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. కాగా ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్‌ను వివరణ కోరగా మంటలు ఆర్పటం కష్టంగా ఉందని, భారీ వర్షం పడితేనే మంటలు ఆగిపోతాయని చెప్పుకొచ్చారు. డ్రైనేజిలో నీటితో ఆర్పే ప్రయత్నం చేసే విషయంపై ఆయన అంతగా స్పందించలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు తమకేమి పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పీఎంశ్రీ పథకం ద్వారా ఒకేషనల్ కోర్సులు

● నియోజకవర్గంలో ఎంపికైన జంపని హైస్కూల్

● భాష నైపుణ్యంపై కూడా శిక్షణ

● 9, 10 విద్యార్థులకు ప్రారంభమైన తరగతులు



జంపని హైస్కూల్లో ఒకేషనల్ కోర్సులపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్

వేమూరు, జూన్ 22 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉన్నత పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిని పెంపొందింపచేసేందుకు పెద్దపీట వేస్తూ ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం (పీఎంశ్రీ)ద్వారా ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ కోర్సులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 2024-2025విద్యా సంవత్సరంలోనే ఈ కోర్సులను ప్రారంభించేందుకు కొన్ని పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేయగా వాటిలో బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూడా ఉంది. ఎంపికైన పాఠశాలల్లో ఒకేషనల్ కోర్సులతో పాటు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాన్ని కూడా పెంపొందించే విధంగా శిక్షణ ఇవ్వనున్నారు. రెండు సంవత్సరాల ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వమే నేషనల్ అప్రంటీషిప్ స్కీమ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించే విధంగా ఈ కోర్సును రూపొందించారు. జంపని పాఠశాలలో ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్, ఆటోమోటివ్ కోర్సులకు అనుమతి ఇచ్చారు. సమగ్ర శిక్ష ద్వారా ఇద్దరు ట్రైనర్లను నియమించి శిక్షణకు సంబంధించిన మెటీరియల్స్‌ను సరఫరా చేశారు. దీంతో శనివారం నుంచి 9, 10 తరగతులకు చెందిన 140 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నరసింహాస్వామి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదో తరగతిలో శిక్షణ పూర్తి కాగానే అప్రంటీస్‌కు వెళ్ళిన విద్యార్థికి కేంద్ర ప్రభుత్వమే రూ.వెయ్యి స్టైఫండ్ కూడా ఇవ్వనుంది. పాఠశాలలో ఈ విధమైన ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట....

హైస్కూల్ స్థాయిలోనే విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేయడం, తమ పాఠశాలను ఈ పథకంలో చేర్చటం హర్షణీయమని ప్రధానోపాధ్యాయుడు నరసింహాస్వామి అన్నారు. ఇతర గ్రామాల నుంచి చేరదలచిన విద్యార్థులు 9వ తరగతిలో చేరే అవకాశం ఉందని, తద్వారా వారికి కూడా కోర్సులు అందించగలమన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు ప్రవేశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు ఒకేషనల్ కోర్సుల ప్రయోజనాన్ని విద్యార్థులకు వివరించారు.



ప్రశంసపత్రాలు అందుకున్న విశ్రాంత సైనికులను అభినందిస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు

ఎన్నికల విధులు నిర్వహించిన మాజీ సైనికులకు ప్రశంసాపత్రాలు

బాపట్ల, జూన్ 22 : ఎన్నికలలో విధులు నిర్వహించిన మాజీ సైనికులకు ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా శనివారం జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మాజీ సైనికులను అభినందించారు. మాజీ సైనికులు సమాజ సేవలో పాల్గొనటానికి ఏమాత్రం వెనుకంజ వేయరన్నారు. బాపట్ల, రేపల్లె, నిజాంపట్నం, చెరుకుపల్లి, చందోలు, పర్చూరు, వేమూరు అసోసియేషన్‌ల నుంచి కూడా మాజీ సైనికులు ఎన్నికల విధులు నిర్వహించటానికి ఔన్నత్యాన్ని చాటారన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టా ఆదిశేషారెడ్డి, సుంకర శేషగిరిరావు, డి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ కృష్ణారావు, మర్రి వీరాస్వామి, కె.ఆంజనేయులు, పసుపులేటి ప్రసాద్, రాంప్రసాద్‌రెడ్డి, కె.ఎస్.ఎన్.ప్రసాద్, పీటా సారధి, నంగనం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ళ ఆటోలు, బస్సులతో పొంచి ఉన్న ప్రమాదం




ఆటోలో స్కూల్ పిల్లలను ఒకరిపై ఒకరిని కూర్చోబెట్టి తీసుకెళుతున్న చిత్రం

బాపట్ల, జూన్ 22 : ప్రైవేట్ స్కూళ్ళ యాజమాన్యం పిల్లలను ఆటోలు, చిన్నపాటి వ్యాన్‌లు, బస్సులలో తరలిస్తున్నారు. ఆటోలలో పిల్లలను ఒకరిపై ఒకరిని కూర్చోబెట్టి వారిపై బ్యాగ్‌లు పెట్టి ఇబ్బందికరంగా తరలిస్తున్నారు. దీనివల్ల ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థులతోపాటు, తల్లిదండ్రులు దీనిపై ఆందోళన చెందుతున్నారు. వేల రూపాయల ఫీజులు వసూళ్ళు చేస్తూ పిల్లలను ఇష్టానుసారంగా తీసుకెళ్ళటంపై విమర్శలు చేస్తున్నారు. దీనిపై రవాణాశాఖాధికారులు స్పందించి తనిఖీలు చేసి తగిన నిబంధనలు పెట్టి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సజావుగా వాహనాలు నడిపే విధంగా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేడు మున్సిపల్ హైస్కూల్‌లో జాబ్‌మేళా

బాపట్లరూరల్, జూన్ 22 : మోడల్ కేరీర్ సెంటర్, జిల్లా ఉపాధి కార్యాలయం బాపట్ల ఆధ్వర్యంలో ఆదివారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రఘు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈజాబ్‌మేళాలో గోదావరి ఆంధ్ర కార్పొరేటివ్ సొసైటీ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎఫ్యాక్ ఫైనాన్షియల్ సర్వీసెస్, టీవీఎస్ మొదలగు కంపెనీలవారు హాజరవుతారని, బాపట్ల జిల్లా పరిసర యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, బీటెక్, డిగ్రీ, ఎమ్మెస్సీ, పీజీ వరకు చదువుకున్న 18-35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు వారి బయోడేటా లేదా రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకల్, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరవ్వాలని తెలిపారు.

గుర్తు తెలియని యువకుడు మృతి



బాపట్ల, జూన్ 22 : పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదురు గుర్తుతెలియని యువకుడు మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడు. డీహైడ్రేషన్ వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు.

మంత్రి గొట్టిపాటికి శంకర ప్రసాద్ అభినందనలు



మంత్రి గొట్టిపాటిని సన్మానిస్తున్న శంకరప్రసాద్

బాపట్లరూరల్, జూన్ 22 : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను శనివారం యానాది హక్కుల పోరాటసమితి రాష్ట్రాధ్యక్షులు తిరువీధుల శంకరప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా తిరువీధుల శంకరప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో యానాదుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా యానాది కులం వారు ఆర్థికంగా ఎదగటానికి, యానాది కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో మంత్రిని సహాయం చేయాలని కోరటం జరిగిందన్నారు. అదేవిధంగా యానాది ప్రజలకు అన్ని పథకాలు వచ్చే విధంగా సహకరించాలని మంత్రిని కోరగా అందుకు ఆయన స్పందించి యానాది ప్రజలకు ప్రభుత్వం ద్వారా అన్ని పథకాలు అమలు జరిగేలా చూస్తానని హామీనివ్వటం జరిగిందని తెలిపారు.

ఎమ్మెల్యే కొణతాలకు భాస్కరరావు అభినందనలు



కొణతాలను అభినందిస్తున్న భాస్కరరావు

కర్లపాలెం, జూన్ 22 : రాజకీయాలలో విలువలతో కూడిన వ్యక్తి, మాజీ మంత్రి అనకాపల్లి జనసేన పార్టీ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నిజమైన రాజకీయ నాయకుడని ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్, పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ మెండు మహేంద్రభాస్కరరావు అన్నారు. కొణతాల రామకృష్ణ జనసేన పార్టీ నూతన శాసన సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా శనివారం ఎం.ఎం.భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు. వీరి వెంట యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, మిట్టపల్లి జానకిరామ్, వాకా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా శంకరమ్మ తల్లి తిరునాళ్ళ

చెరుకుపల్లి, జూన్ 22 : మండలంలోని బొలుసులపాలెం గ్రామంలో ఉన్న శ్రీ శంకరమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ళ శనివారం కన్నుల పండువగా జరిగింది. తిరునాళ్ళలో విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పు విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి అమ్మవారికి పంచాయతీలోని ప్రజలు పసుపు, కుంకుమ, చీర, రవిక, అందించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎస్‌ఐ సురేష్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా కట్లమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం



కట్లమ్మతల్లి

అమృతలూరు, జూలై 22 : మండల పరిధిలోని తురుమెళ్ళ గ్రామ దేవత శ్రీ కట్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, మహిళలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రభ ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు నాలుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

వేమూరు, జూన్ 22 : మండలంలోని వేమూరు 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కోడిపర్రు ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం నాలుగు గ్రామాల్లో ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఏఈ గోపి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు వేమూరు గ్రామ పరిధిలోని బేతేలుపురం ఏరియా వరహాపురం, బూతుమల్లి గ్రామాల్లోని గృహాలు, వ్యవసాయ మోటార్లకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంత రైతులు, వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

శ్రీ సత్యసాయిబాబా మందిరంలో పౌర్ణమి హారతి

కర్లపాలెం, జూన్ 22 : కర్లపాలెంలోని శ్రీ సత్యసాయిబాబా మందిరంలో పౌర్ణమి సందర్భంగా శ్రీ సత్యసాయిబాబా, శ్రీషిరిడి సాయిబాబాకు శనివారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా విశేష పూజలతోపాటు పౌర్ణమి ప్రత్యేక హారతిని నిర్వహించారు. సాయిభక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో మంతెన శివరామరాజు, తుమ్మల శ్రీనివాసరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

రేపల్లె, జూన్ 22 : విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలను అందించాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌ను శనివారం ఉప్పూడి ఎంపీటీసీ సతీష్‌బాబు, టీడీపీ నాయకులు కాంతి సుమన్‌బాబు, సచివాలయ సిబ్బంది కలసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా కార్యాలయానికి పనుల మీద వచ్చే వారిని పలుమార్లు తిప్పకుండా ఏకకాలంలో పనులు చేసి వారికి అందుబాటులో ఉండాలని సూచించారు. సచివాలయ పరిధిలోని గ్రామాల అభివృద్ధి కోసం సిబ్బంది సేవలు అందించటంతోపాటు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేల కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి సోదరుడు శివప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప్పూడి ఎంపీటీసీ, టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలో గాయత్రి ఉత్తమ ప్రదర్శన



నాగిడి గాయత్రి

నగరం, జూన్ 22 : మండలంలోని నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలో స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల విద్యార్థిని నాగిడి గాయత్రి (సెకండ్ బీపీసీఏ) ఉత్తమ ప్రదర్శన కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు కర్ణాటకలోని దండేలలో జరిగిన 12వ నేషనల్ ఛాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీజీ డైరెక్టర్ డాక్టర్ కేసన సురేంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, కళాశాల అడ్మినిస్ట్రేషన్ అధికారి మాగంటి సుధాకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డుదారులు పనులలో భాగస్వాములు కావాలి

చెరుకుపల్లి, జూన్ 22 : గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో శ్రీనివాస్‌మూర్తి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఫీల్డు అసిస్టెంట్‌లు జాబ్‌కార్డుదారులకు 100 రోజులు పనులు కల్పించే విధంగా చొరవ చూపాలన్నారు. ప్రతి నిత్యం జాబ్ కార్డుదారులు ఉపాధి హామీ పథకంలో పాల్గొని గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకంలో పాల్గొన్న జాబ్ కార్డుదారులకు త్వరితగతిన నగదును అందించే విధంగా ఫీల్డు అసిస్టెంట్‌లు పనిచేయాలని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ఎన్‌ఆర్‌జీఎస్ పనులు ఎంతగానో దోహదపడతాయని ఆయన చెప్పారు.

సోషల్ ఆడిట్‌ను నిష్పక్షపాతంగా జరపాలి : ఎంపీడీవో

వేమూరు, జూన్ 22 : గ్రామాల స్థాయిలో జరగనున్న ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌ను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సోషల్ ఆడిట్ బృందం సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీవో టెక్నికల్ అసిస్టెంట్, సిఓ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు మధ్య సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆదివారం నుంచి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లించడంలో లోటుపాట్లు, పనులకు సంబంధించిన కొలతలు గుర్తించాలన్నారు. సామాజిక పెన్షన్‌లపై కూడా బృందం సభ్యులు గ్రామాల్లో పర్యటించి తనిఖీ జరపాలని, వీటికి సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు కార్యాలయానికి అందజేయాలని కోరారు. గ్రామాల స్థాయిలో ఉన్న అధికారులంతా సామాజిక బృందం సభ్యులకు సహాయంగా ఉండి సోషల్ ఆడిట్‌ను జయప్రదం చేయాలని కోరారు.

కలెక్టర్ ప్రశంసలు అందుకున్న ఎంపీడీవో

వేమూరు, జూన్ 22 : వేమూరు ఎంపీడీవో శేషగిరిరావు జిల్లా కలెక్టర్ ప్రశంసలు అందుకున్నారు. జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 92 రోజుల పాటు ఎంసీసీ అధికారిగా నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించినందుకు అలాగే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏఆర్‌వోగా సమర్థవంతంగా పని చేసినందుకు కలెక్టర్ రంజిత్ బాషా ఎంపీడీవో సేవలను గుర్తించారు. శుక్రవారం రాత్రి బాపట్ల కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఎంపీడీవోకు జిల్లా కలెక్టర్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

యువతిని హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ తదితరులు

బాపట్ల,జూన్ 22 : జిల్లాలోని చీరాల మండలం ఈపూరుపాలెం గ్రామంలో యువతిపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ డిమాండ్ చేశారు. యువతి హత్య గురించి తెలుసుకున్న వెంటనే ప్రభుత్వం స్పందించి హోమ్‌శాఖా మంత్రి వంగలపూడి అనితను పంపించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సాయం అందించటం అభినందనీయమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దీనికి కారకులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఎస్‌పి రాజు, మారం రవికుమార్, అంగలకుదురు నటరాజన్, గోపినాధ్, భాను తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకులు

బాపట్ల, జూన్ 22 : ఈపూరుపాలెం గ్రామంలో యువతిపై అత్యాచారం చేసి చంపిన వారిని వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకులు టి.సుభాషిణి, ఎన్.లక్ష్మీ డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం వారు మాట్లాడుతూ యువతిపై సామూహిక అత్యాచారం చేయటం బాధాకరమన్నారు. చనిపోయిన యువతి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు ఇలాంటి సంఘటనలు గురించి పట్టించుకోకపోవటం వల్లే పునరావృతం అవుతున్నాయన్నారు.

హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

భట్టిప్రోలు, జూన్ 22 : చీరాల మండలం ఈపూరుపాలెంకు చెందిన యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా గంజాయి, డ్రగ్స్, మద్యంపై నియంత్రణ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బాలాజీ కోరారు. విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు స్పందించడంతో పాటు హోంమంత్రి అనితను ఘటనా స్థలానికి పంపించడం శుభపరిణామమన్నారు. 48 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని బాలాజీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, జి.లక్ష్మీ, కె.వీరమోహనరావు పాల్గొన్నారు.


హత్యాచారం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్

నిందితులను వదలొద్దు

● ఎంపీ కృష్ణప్రసాద్

చీరాల, జూన్ 22 : 'యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన అమానుషం. అనాగరికం. నిందితులు ఎవరినీ వదలం. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. చీరాల మండలం ఈపురుపాలెంలో శుక్రవారం యువతి పై హత్యాచార ఉదంతం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఎంపీ కృష్ణ ప్రసాద్ ఈపురుపాలెం వచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని చెప్పారు. నిందితులను ఎవరిని వదిలిపెట్టమని చెప్పారు. ఘటన పూర్వాపరాలను డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశంకు పక్కనే ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ప్రహరీ గోడపై కొందరు అప్పుడప్పుడు కూర్చుంటారనే కోణంలో వివరాలు అడిగి తెసుకున్నారు. స్కూలు విద్యార్థినులతో మాట్లాడారు. ఎంపీ వెంట టీడీపీ నాయకులు నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.


ముప్పవరంలో టీడీపీ నేత చేపట్టిన పాదయాత్రను ప్రారంభిస్తున్న గొట్టిపాటి హర్షవర్ధన్

శింగరకొండకు టీడీపీ నేత పాదయాత్ర

పంగులూరు, జూన్ 22 : మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు గరిమిడి జగన్మోహనరావు శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి సన్నిధికి చేపట్టిన మహా పాదయాత్రను గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ ప్రారంభించారు. గొట్టిపాటి రవికుమార్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లభించగా తన మొక్కు తీర్చుకునేందుకు గరిమిడి జగన్మోహనరావు శనివారం స్థానిక మహిళలు, పార్టీ నేతలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభించేందుకు హాజరయిన గొట్టిపాటి తనయుడు హర్షవర్ధన్ ముందుగా గ్రామంలోని బొడ్డురాయి వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాదయాత్ర ప్రారంభ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, బాలిన రామసుబ్బారావు, చింతల సహదేవుడు, బొర్రెడ్డి ఓబుల్‌రెడ్డి, గుర్రం ఆదిశేఖర్, అల్లంనేని బ్రహ్మానందస్వామి, బొప్పుడి నాగేశ్వరరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, జక్రయ్య, వరపర్ల సుబ్బారావు, జేకేసీ, ఇంటూరి పూర్ణయ్య, కోటయ్య, పలు గ్రామాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఏలూరి గెలుపుతో నక్కలపాలెం నుంచి పాదయాత్ర

ఇంకొల్లు,జూన్ 22: పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా మండలంలోని పెద్దనక్కలపాలెం, చిననక్కలపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామల ప్రజలు పావులూరి పోలిమేర వీరాంజనేయస్వామి సన్నిధికి పాదయాత్ర చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పాదయాత్రలో మహిళలు, రైతులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 1000 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ పాదయాత్రలో చిలుకూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి రామాంజనేయులు, చిలుకూరి రంగారావు, బాచిన శ్రీకాంత్, ఏలూరి మురళీకృష్ణ, శ్రీనివాసచక్రవర్తి, పవన్, నరసింహస్వామి, వీరనారాయణ, నీలిమ, సుబ్బరావమ్మ గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సీతా రాముల మూలవిరాట్టు విగ్రహాలు

వైభవంగా సీతారాముల కల్యాణం

మార్టూరు, జూన్ 22 : మండలంలోని తాటివారిపాలెం గ్రామంలోని రామాలయం లో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామంలోని రామాలయం 4 వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించడానికి ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. దాంతో అర్చకులు ముప్పాళ్ల శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం మండపంలో ఉదయం యజ్ఞయాగాదులు, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని 13 జంటలకు చెందిన దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాదం చేశారు. తరువాత సాయంత్రం దేవాలయంలో ఏర్పాటుచేసిన వేదికపైన సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి 15 మంది దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారిలో కొంతమంది స్వామి వారి దంపతులకు నూతన వస్త్రాలను, పట్టు దుస్తులు అందజేశారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి గ్రామస్థులు భారీగా తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కొండయ్య


డ్రగ్స్ రహిత సమాజం కోసం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 22 : డ్రగ్స్ రహిత సమాజం రూపకల్పనే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం సచివాలంలో ప్రిన్సిపల్ హోం సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ చాంబర్‌లో ప్రిన్సిపల్ హోం సెక్రటరీ హరీష్‌కుమార్ గుప్తాతో కలసి డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు సంబంధించి చైతన్యం కలిగించే కరపత్రాలను కొండయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలతో యువత నిర్వీర్యం అవుతుందన్నారు. ఆ మహమ్మారిని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు చైతన్యవంతంగా ఆలోచించి సహకరించాలని పిలుపునిచ్చారు.

అమాత్య పదవితో ఉప్పొంగిన అద్దంకి

మంత్రి గొట్టిపాటిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ శ్రేణులు

అద్దంకి, జూన్ 22: రాష్ట్రవిద్యుత్‌శాఖమంత్రిగా గొట్టిపాటి రవికుమార్ శనివారం మధ్యాహ్నం అమరావతిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.


విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

అద్దంకి మండల నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, చాగంటి రాజేంద్ర ప్రసాద్, పెంట్యాల రామాంజనేయులు, అడుసుమల్లి శ్రీనివాసరావు, గాలం శ్రీనివాసరావు, కోండ్రు వీరాంజనేయులు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, 19 వ వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు, ఇక్కుర్తి కొండలు, ధర్మవరపు నాగేశ్వరరావు, దామా సురేంద్ర, అద్దంకి పట్టణ టీడీపీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య నాయకులు గార్లపాటి శ్రీనివాసరావు, చిన్ని హనుమా తదితరులు అమరావతికి వెళ్లి గొట్టిపాటికి శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకికి తొలిసారి మంత్రి పదవి దక్కటం, శనివారం విద్యుత్‌శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ బాధ్యతలు చేపట్టడంతో అద్దంకి నియోజకవర్గ టీడీపీ శ్రేణులలో ఆనందం ఉప్పొంగింది.

ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, పోతుల రామారావులతో పాటు గూడూరి ఎరిక్షన్‌బాబు, దామచర్ల సత్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మేదరమెట్లలో..

మేదరమెట్ల : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మేదరమెట్లలోని పాత ఒంగోలు రోడ్డులో ఎస్‌బీ కన్వెన్షన్ నందు టీడీపీ శ్రేణులు, ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.

కాలినడకన శింగరకొండకు టీడీపీ శ్రేణులు

టీడీపీ అధికారంలోకి రావటం, ఎమ్మెల్యే గా గొట్టిపాటి రవికుమార్ ఎన్నికై మంత్రి పదవి చేపట్టడంతో గోవాడ టీడీపీ శ్రేణులు శనివారం కాలినడకన శింగరకొండకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నేతలు పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు, నరిశెట్టి వీరయ్య, రావిపాటి చెన్నయ్య మాదాల వెంకటేశ్వర్లు తదితరులు ఆధ్వర్యంలో సుమారు 200 మంది టీడీపీ శ్రేణులు గోవాడ నుంచి చినకొత్తపల్లి, కొత్తరెడ్డిపాలెం, శింగరకొండపాలెం మీదుగా కాలినడకన శింగరకొండకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.


విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అద్దంకి మండల టీడీపీ నేతలు

కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే కొండయ్య వెంట పలువురు నాయకులు ఉన్నారు.

అమరావతికి తరలిన టీడీపీ నేతలు

బల్లికురవ : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మండల టీడీపీ నేతలు రాజధాని అమరావతికి పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అద్దంకి నియోజకవర్గానికి మొట్టమొదటి సారిగా మంత్రి వర్గంలో చోటు కల్పించటంతో టీడీపీ శ్రేణులు ఎంతో ఉత్సాహంతో ఈకార్యక్రమానికి తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో నేతలు మలినేని గోవిందరావు, దూళిపాళ్ల రామగోవిందు, దద్దాల అంజయ్య, బెల్లంకొండ సుబ్బయ్య, పావులూరి ఏడుకొండలు, పలు గ్రామాలకు చెందిన నేతలు ఉన్నారు.


మంత్రి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బల్లికురవ మండల టీడీపీ నేతలు

చీరాల నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలి

- మంత్రి రవికుమార్‌తో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల : విద్యుత్‌శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి రవికుమార్‌ను చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య శనివారం కలిశారు. మంత్రి చాంబర్‌లో రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కొండయ్య మంత్రి రవికుమార్‌ను


రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అద్దంకి పట్టణ టీడీపీ నేతలు

గొట్టిపాటికి శుభాకాంక్షలు తెలిపిన పలువురు ఎమ్మెల్యేలు

విద్యుత్‌శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించగా ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి,


రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్యవైశ్య నేతలు

రెవెన్యూ సమస్యలపై మంత్రికి ఏలూరి వినతి

పర్చూరు, జూన్ 22: పర్చూరు నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో పలు సమస్యలకు సంబంధించిన లేఖలను మంత్రికి అందజేశారు. త్వరితగతిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ప్రధానంగా పర్చూరు నియోజకవర్గంలోని అత్యధిక సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించేందుకు, ముస్లిం సోదరులకు జీవనోపాధి పొందేలా ఆటోనగర్ ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఇంకొల్లు, మార్టూరు, పర్చూరు మండల కేంద్రాల్లో ఆటోనగర్ ఏర్పాటుకు సానుకూలంగా మంత్రి స్పందించినట్లు ఏలూరి తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాల మరమ్మతులు చేపట్టి ఆధునీకరించాని కోరారు. దశాబ్దాల క్రితం నిర్మించిన కార్యాలయాలు కావటంతో కొద్దిపాటి వర్షం పడినా ఉద్యోగులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని మంత్రికి వివరించారు. అదేవిధంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, స్థలం కేటాయించి నూతన భవనాలు నిర్మించాలని మంత్రిని ఏలూరి కోరారు. వీటిపై స్పందించిన మంత్రి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఏలూరి తెలిపారు.


సమస్యలపై మంత్రి అనగానికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

హంతకులను కఠినంగా శిక్షించాలి

- ఘటనపై మార్మోగిన నినాదాలు

చీరాలటౌన్, జూన్ 22 : చీరాల మండలం ఈపూరుపాలెం సీతారామపేటలో యువతిపై దాష్టీకానికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నినాదాలు మార్మోగాయి. ఈక్రమంలోనే ఉదయం బాధిత కుటుంబాన్ని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి పరామర్శించారు. ఈసందర్భంగా ఘటనపై ఆరా తీశారు. నేరానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, డివిజన్ కార్యదర్శి ఎన్. బాబురావు, తదితరులు ఉన్నారు.


గడియారస్తంభం కూడలిలో మానవహారం నిర్వహిస్తు విద్యార్థులు

నిందితులను కఠినంగా శిక్షించాలి ఈపూరుపాలెంలో దురాగతానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, వివిధ కళాశాలల విద్యార్థినులు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవనం నుంచి ర్యాలీగా గడియారస్తంభంకు చేరుకున్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గంజాయి మత్తులో యువతిపై దారుణానికి పాల్పడినట్లు ఆరోపించారు. ఇలాంటి క్రూర మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సుభాషిణి, మనోజ్‌కుమార్, కొండయ్య, జనార్దన్, లక్ష్మీ, భగవాన్‌దాస్, వెంకటేష్, రాంబాబు, వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

వలపర్లలో రెండిళ్లలో చోరీ

మార్టూరు, జూన్ 22: మండలంలోని వలపర్లగ్రామంలో రెండు ఇళ్లల్లో చోరీ జరిగినట్లు శనివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం వలపర్ల గ్రామంలోని షేక్ మాబులా, పర్చూరి సుకన్య అనే మహిళల ఇళ్లల్లో చోరీ జరిగింది. గ్రామంలోని పక్క పక్క వీధులలో నివాసం ఉండే వారిద్దరు మహిళలు విడివిడిగా గురువారం వేరే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చిన వారిద్దరు మహిళలు ఇంటికి వెళ్లి చూడగా తలుపులు తాళం పగలగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గ్రహించారు. వారిలో సుకన్య ఇంటిలోని బీరువా తలుపులు తెరచి అందులోని దుస్తులు, వస్తువులను చెల్లా చెదురు చేశారు. అదేవిధంగా మాబులా ఇంటిలోని 11 గ్రాముల విలువైన బంగారపు చిన్న వస్తువులు,సుకన్య ఇంటిలోని 12 గ్రాముల బంగారు వస్తువులను దొంగలు ఎత్తుకుపోయినట్లు గమనించారు. దాంతో వారిద్దరు శనివారం సాయంత్రం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


బీరువాలోని దుస్తులను చెల్లాచెదురు చేసిన దొంగలు

అనంతరం ఏఎస్ఐ బాషా హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వరరావు వలపర్ల గ్రామం వెళ్లి దొంగతనం జరిగిన రెండు ఇళ్లను పరిశీలించారు. ఈ కాలనీల్లోని స్థానికులను విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు తెలిపారు.

రేపు మార్టూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

పంగులూరు, జూన్ 22 : మండల కేంద్రమైన మార్టూరులో ఈ నెల 24న స్థానిక రాయల్ జూనియర్ కళాశాలలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ క్యాంప్ ఇన్‌చార్జి చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, పంగులూరు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ వైద్య శిబిరంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు గుండె, చర్మ వ్యాధులు, పళ్లకు సంబంధించిన అనేక చికిత్సలు ఉచితంగా చేస్తారని తెలిపారు.

సోమవారం ఉదయం 9 గంటలకు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఈ వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. గుండె సమస్యలు ఉన్న వారికి ఈసీజీ, ఈసీహెచ్‌వో పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకుని రావాలని కోరారు.

ఒడ్డుకు చేరిన మరో ఇద్దరు మృతదేహాలు


అమల్‌రాజా(ఫైల్)


నితిన్(ఫైల్)

రామాపురం(చీరాల టౌన్), జూన్ 22 : బాపట్ల జిల్లా రామాపురం తీరంలో శుక్రవారం గల్లంతయిన ఇద్దరి మృతదేహాలు శనివారం ఉదయం సమీపంలోనే ఒడ్డుకు చేరాయి. ఏలూరు జిల్లా పెద్దవేగి మండలం దుగ్గిరాల గ్రామానికి చెందిన జాలా కిషోర్(26), గొటుకుల తేజ(19), కోరు అమల్‌రాజు(19), చెట్టుమాల నితిన్(19), గౌతమ్, సాగర్, బుచికి, మోహన్, తేజ, సునీల్, రామరాజు, మురళి స్నేహితులు. వీరంతా రామాపురం సముద్రంలో మునిగేందుకు వ్యాన్‌లో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో వచ్చారు. అరగంట పాటు భోజనం చేశారు. 2.30నిమిషాలకు సముద్రంలో దిగి 5 నిముషాలు మాత్రమే మునిగారు. అప్పటి వరకు కనీసం వీరి తలలు కూడా తడవలేదు. ఇంతలో ఒక్కసారిగా కెరటాలు తాకిడికి అంతా లోనికి కొట్టుకుపోయారు. అదృష్టవశాత్తు ఏడుగురు బయటకు రాగా కిషోర్, గొటుకుల తేజ, నితిన్, అమల్‌రాజా లోనికి కొట్టుకుపోయారు. దీంతో సహచరులు బిగ్గరగా కేకలు వేయగా మెరైన్, రూరల్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అయితే కొద్దిసేపటికే గొటుకుల తేజ, జాలా కిషోర్ మృతదేహాలు ఒడ్డుకు రాగా, నితిన్, అమల్‌రాజా జాడకోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఎట్టకేలకు సమీపంలోనే శనివారం ఉదయం మిగిలిన ఇద్దరి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. దీంతో కేసు నమోదుచేసుకున్న ఈపూరుపాలెం పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే అమల్ రాజా తండ్రి గతంలోనే మృతిచెందగా, తాత గతేడాది ఇదేరోజు మృతిచెందాడు. సోదరి, తల్లికి అండగా ఉన్న అమల్‌రాజా కూడా మృతిచెందడంతో ఆకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హోంమంత్రి పర్యటన అనంతరం తీరంలో జాగ్రత్తలు

చీరాలకు శుక్రవారం వచ్చిన రాష్ట్ర హోంమంత్రి అనిత ఈ విషయంపై ఆరా తీశారు. పోలీసులకు తగు జాగ్రత్తలు సూచించారు. దీంతో వారు సముద్రతీరంలో హెచ్చరిక బోర్డులు, డేంజర్ జోన్‌లలో బ్యానర్‌లు ఏర్పాటు చేశారు. అలాగే నిత్యం పోలీస్ పికెట్ ఉంటుందని ప్రకటించారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, జూన్22: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం నిర్వహించారు. అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. లక్ష తమలపాకులతో 11 ఆవృత్తములు గా వేదపండితులు, అర్చకులు పూజ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

అద్దంకిటౌన్, జూన్ 22: ఏపీ గురుకుల పాఠశాల ఎంట్రెన్స్ పరీక్షలలో ప్రతిభ చూపి సీట్లు సాధించిన విద్యార్థులకు శనివారం బహుమతులు అందజేశారు. మండలంలోని రాళ్ళపల్లి ప్రాథమిక పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీ సమావేశం జరిగింది. విద్యార్థులు ప్రభుత్వం అందించే వసతులతో సక్రమంగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్. హనుమంతరావు మరో ఇద్దరికి ద్వితీయ, తృతీయ బహుమతిలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఉప ముఖ్యమంత్రిని కలిసిన విజయ్‌కుమార్

పర్చూరు, జూన్ 22: ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త పెద్దపూడి విజయ్ కుమార్ శనివారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిశారు. జనసేన పార్టీ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద పార్టీగా నిలిచిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపి పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రంగాల్లో రాష్ట్రం ఉన్నతంగా అభివృద్ధి చెందేలా పరిపాలించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేసిన జనసైనికులను పవన్ కల్యాణ్ అభినందించినట్లు విజయ్ కుమార్ తెలిపారు.


పవన్‌ను అభినందిస్తున్న విజయ్‌కుమార్

పాఠశాలకు దాతల సహకారం అభినందనీయం


కంప్యూటర్‌ను అందజేస్తున్న దాతలు

ఇంకొల్లు,జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయసహకారాలు అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి అనంతు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నాగండ్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన సోమేపల్లి భాస్కరరావు, ప్రమీలా దంపతులు పాఠశాలకు సుమారు 40వేల రూపాయల విలువ కలిగిన కంప్యూటర్‌ను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామదాసు మాట్లాడుతూ దాతల సహకారాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత చదువులలో ముందుకు సాగాలని కోరారు. అనంతరం దాతలు భాస్కరరావు,ప్రమీలా దంపతులను అభినందించారు.

నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలు

● ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి


రామాపురం తీరంలో పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

వేటపాలెం(చీరాల), జూన్ 22 : తీర ప్రాంతంలో నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి చెప్పారు. వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం తదితర ప్రాంతాల్లో సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందని జర్నలిస్ట్ నాగార్జునరెడ్డి, మరి కొందరు చేసిన ఫిర్యాదుల మేరకు శనివారం పలుశాఖల అధికారులతో కలసి ఆర్డీవో తీరప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారికి నోటీసులు అందజేసి తగిన చర్యలు చేపడామన్నారు. తీరంలో ఎవరు కూడా సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించరాదన్నారు. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సముద్రంలో అపశ్రుతులు బాధాకరం

చీరాల, జూన్ 22 : వేటపాలెం మండలం రామాపురం తీరంలో శుక్రవారం సముద్రంలో గల్లంతైన నలుగురు యువకులు విగతజీవులుగా శనివారం ఒడ్డుకు చేరారు. మృతదేహాలను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఏరియా వైద్యశాల మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించారు. సంఘటన పూర్వాపరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేటపాలెం మండలం రామాపురం తీరం వద్ద దుర్ఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. ప్రమాదాలకు కారణాలపై ఆరా తీశారు. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బలరాం వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.